# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## శ్రీమహాసరస్వతి యాగానికి విస్తృత ఏర్పాట్లు



కాణిపాకం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: మాఘ శుద్దపంచమి (వసంత పంచమి) సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత ఫిబ్రవరి 3న శ్రీమహాసరస్వతి యాగమును నిర్వహించనున్న సందర్భంగా దేవస్థానం అధికారులు భారీ ఏర్పాటు చేపడుతున్నారు. ఆస్థాన మండపంలో ఉదయం 9 గంటలకు ఈయాగమును అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఆలయ ఈఓ పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు చేపట్టవలసిన ఏర్పాట్లను గురించి పరిశీలించారు. ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఏఈ శివాంజనేయులు, సీఎఫ్ఓ నాగేశ్వరరావు తదతరులు పాల్గొన్నారు.

## వేదిక్ వర్సిటీలో చిరుత సంచారం

తిరుపతి విద్య ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



చిరుత ఎస్వీయూ,వేదిక్, వెటర్నరీ వర్సిటీలలో సంచరిస్తున్నట్లు స్పష్టంగా సీసీ కెమెరాలలో రికార్డు అవుతున్నా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. శుక్రవారం రాత్రి వేదిక్ వర్సిటీ పరిపాలనా భవనం ఎదుటు శునకంపై దాడి చేసి పొదలలోకి తీసుకెళ్లుతున్న దృశ్యాల సీసీ కెమెరాలలోనూ, కొందరు విద్యార్థులు రికార్డు చేసిన వీడియోలో హల్చల్ చేస్తున్నాయి. కానీ ఇటు వర్సిటీ అధికారులు, అటవీశాఖ అధికారులు కేవలం సీసీకెమెరాలు అమర్చి, హెచ్చరిక నోటీస్ బోర్డులతోనూ సరిపెట్టి చేయి దులుపుకున్నారనే విమర్శలు వస్తున్నా యి. వర్సిటీల ప్రాంగణంలో వెంటనే బోన్లను ఏర్పాటు చేయాలని ఉద్యోగులు, విద్యార్థులు అధికారులను కోరుతున్నారు.

## తిరుపతిలో అనూహ్య నాటకీయ పరిణామం !

### ఒక్క డిప్యూటీమేయర్ కోసం బరితెగింపు -వైసిపి అభ్యర్థిపై కక్షసాధింపు ధోరణి -బలంలేకున్నా పోటీకి కూటమి సిద్ధం

**ప్రభాతవార్త-తిరుపతి కార్పొరేషన్**



తిరుపతినగరపాలకకౌన్సిల్‌లో ఖాళీఅయి మరో ఏడాది పదవీకాలం ఉన్న మరో డిప్యూటీ మేయర్ ఎన్నికకు ముందే అనూహ్యనాటకీయ పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కౌన్సిల్‌లో పూర్తిస్థాయిలో బలం లేకపోయినా అధికార కూటమి ప్రభుత్వంలోని జనసేనపార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పట్టుకోసం పావులు కదుపుతూ చివరకు వైసిపి రెండవ డిప్యూటీ మేయర్ అభ్యర్థి శేఖర్‌రెడ్డిపై కక్షసాధింపు ధోరణితో శనివారం నగరపాలకసంస్థ అధికారులు వ్యవహరించడంతో పదవుల కోసం రాజకీయం ఇంత విచిత్రంగా ఉంటుందా?అని నగరవాసులు చర్చ చేస్తున్నారు. 2021లో జరిగిన తొలినగరపాలక కౌన్సిల్ ఎన్నికల్లో 50 డివిజన్లకుగాను ఇప్పటికీ 47మంది వైసిపి కార్పొరేటర్లే ఉండటం, (వారిలో ఒక మేయర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ),ఒక టిడిపి కార్పొరేటర్ ఆర్‌సి మునికృష్ణ కొనసాగుతున్నారు. నాలుగేళ్ళపాటు వైసిపి జెండాపైనే గెలిచి ఆ పార్టీ చెంతనే ఉన్న కొందరు కార్పొరేటర్లు 10మందివరకు గత ఏడాది సార్వత్రిక ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వంలో తిరుపతిలో జనసేనపార్టీ ఎంఎల్ఏ వైపు చేరారు. ఇదీ వైసిపికి మింగుడుపడని విషయంగా మారినా ఆషామాషీగా తీసుకున్నారు. తాజాగా ఖాళీఅయిన రెండవ డిప్యూటీమేయర్ పదవికి ఎన్నికలు జరిగేలా ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో జిల్లా కలెక్టర్ నేతృత్వంలో ఆ ఎన్నిక సోమవారం 3వతేదీ ఉదయం 11గంటలకు జరగనుంది. దీనికంటే ముందే తిరుపతిలో వైసిపి కార్పొరేటర్లను కాపాడుకునేందుకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి విప్ జారీచేశారు. వైసిపి జెండాపై గెలిచిన కార్పొరేటర్లు అందరూ వైసిపితోనే ఉండాలని, పరోక్షపద్దతిలో ఓటు కూడా వైసిపి బలపరిచిన అభ్యర్థికే వేయాలని ఉద్దేశ్యం. అందుకు తగ్గట్లు కార్పొరేటర్లతో క్యాంపు కూడా చేపట్టింది. ఇదే సమయంలో ఏకంగా ఏడాది కాలం ఉన్న రెండవ డిప్యూటీ మేయర్ పదవిని కూటమి చేజిక్కించుకోవాలనే ఆశతో కొందరు కార్పొరేటర్లను తమవైపు తిప్పుకునేందుకు పావులు కదుపుతున్నారనేది నగరంలో హాట్‌టాఫిక్. ఈ సమయంలో శనివారం ఉదయం ఉన్నపళంగా ద్వారకానగర్‌లోని డిప్యూటీ మేయర్ అభ్యర్థి నిర్మాణంలో ఉన్న ఇంటిపై కన్నేసి నిబంధనలు వ్యతిరేకమంటూ పడగొట్టేపనులు మొదలుపెట్టారు. ఇదీ కాస్త నగరంలో కూటమికి వ్యతిరేకతగా తయారైంది. ఈ నేపథ్యంలో సోమవారం జరగనున్న డిప్యూటీ మేయర్ ఎన్నికలో బలమున్న వైసిపి నేతలు పట్టుసాధించుకుంటారో, లేకుంటే కనీసం పోటీకి అవకాశం కూడా లేని కూటమి నేతలు, జనసేనపార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యే పరువుకాపాడుకునే పరిస్థితి ఉంటుందా?అనేది కాలమే నిర్ణయించనుంది.

## ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు.. !



విలేకరుల సమావేశంలో శేఖర్‌రెడ్డికి మద్దతు పలికిన నేతలను అరెస్టు చేసిన దృశ్యాలను చూపుతున్న వైసీపీ నేతలు

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్తః తిరుపతిలో రెండవ డిప్యూటీమేయర్ పదవికి రేపు జరిగే ఎన్నికల్లో బలం లేకున్నా కూటమినేతలు ప్రజాస్వామ్యాన్ని ఖూనీచేసేలా ,పోలీసులను అడ్డుపెట్టుకుని వ్యవహరిస్తున్నారని వైసిపి అరుణయాదవ్,పసుపులేటి సురేష్ మండిపడ్డారు. కార్పొరేటర్లు వైసిపికి బలం ఉందని, ఇప్పటికే విప్ జారి చేశామని, డిప్యూటీ మేయర్ ఎన్నికల్లో తాము గెలుస్తామన్నారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరుణయాదవ్,పసుపులేటి సురేష్ మాట్లాడారు. వైసిపి తరపున డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా కార్పొరేటర్ శేఖర్‌రెడ్డిని ఏకగ్రీవంగా నియమించారన్నారు.. అయితే ఈ విషయాన్ని జీర్ణించుకోలేని కూటమి నేతలు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, పోలీసులను అడ్డంపెట్టుకుని అక్రమ కట్టడాల పేరుతో శేఖర్‌రెడ్డిని భయభ్రాంతులకు గురి చేయడంతోపాటు ఆయన ఆస్తులను ధ్వంసం చేయాలని ప్రయత్నించారు. ఈ సంఘటనకు వ్యతిరేకించి శేఖర్‌రెడ్డికి మద్దతుగా నిలిచిన వైఎస్ఆర్‌సీపీ మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి అభినయ్‌రెడ్డిని, నగర మేయర్ డాక్టర్ శిరీషాను, దాదాపు 29 మంది కార్పొరేటర్లను అరెస్టు చేసి పోలీస్టేషన్లల్లో పెట్టడం దారుణమని ఖండించారు.

### సామాన్యుడికి
## తప్పిన 'పన్ను'భారం

**-రూ.12లక్షల ఆదాయానికి పన్ను ఉండదు**
**-ఫెన్షనర్లకు భారీ ఊరట**



తిరుపతి,ఫిబ్రవరి 1ప్రభాతవార్త: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలాసీతారామన్ శనివారం ప్రవేశపెట్టిన బడ్జెట్ సామాన్యుడికి పన్నుభారం నుండి ఊరట కలిగించేలా రూపొందించారు. ప్రధానంగా ఏడాదికి 12లక్షల రూపాయలు ఆదాయం ఉన్న ఉద్యోగులు, సామాన్య మధ్యతరగతి వర్గాల ప్రజలకు ఈ బడ్జెట్‌లో ఆశాజనకంగా పన్ను లేకుండా చేయడం నిజంగా ఒక వరమని ప్రజలు భావిస్తున్నారు. ఫెన్షనర్లకు 90శాతంమందివరకు పన్ను చెల్లించే అవసరం లేకుండా వాళ్ళు ప్రశాంత విశ్రాంతి జీవితం గడిపే అవకాశం ఉంది. ఆర్థిక బలం చేకూర్చే విధంగా కొత్త బడ్జెట్ ప్రతిపాదనలు ఉన్నాయని విశ్రాంత ఉద్యోగులు అభిప్రాయం వ్యక్తం చేశారు. వార్షిక ఆదాయం 12లక్షల వరకు పన్ను చెల్లింపునుండి మినహాయింపు ఒక చారిత్రాత్మకమైన ప్రతిపాదనగా ప్రజలు అభివర్ణిస్తున్నారు. మధ్యతరగతి వర్గాలు 80వేల రూపాయల వరకు పన్ను చెల్లించకపోవడం వల్ల ఆర్థిక కొనుగోలుశక్తి పెరుగుతుంది. ఇది వారి కుటుంబానికి ఎంతో మేలు చేకూరుస్తుందని విశ్లేషకులు భావన. ఇక సోలార్, బ్యాటరీ పరిశ్రమలకు ప్రోత్సాహకరంగా వరాలు ప్రకటించారు. పట్టణాల్లో నివాసముంటున్న పేదప్రజలకు 30వేల రూపాయల వరకు యుపిఐ లింక్డ్ క్రెడిట్ కార్డులు జారీ, దేశవ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో డేకేర్ క్యాన్సర్ సెంటర్లు ఏర్పాటుకు నిధులు కేటాయించడం, ప్రతి ఇంటికి రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు విడుదల, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధనకు అవసరమైన నిధులు , పండ్లు కూరగాయల పంటల ఉత్పత్తికి నూతన పథకాలు, వ్యవసాయానికి ప్రోత్సాహం చూపడం వంటివి ఈ బడ్జెట్‌లో సామాన్యుడికి మంచిదని చెబుతున్నారు. ఆరోగ్యవ్యవస్థల బలోపేతానికి నిధులు కేటాయింపు కూడా ,అంగన్‌వాడీ కేంద్రాలకు కొత్త హంగులు ,ప్రభుత్వ ఉన్నతపాఠశాలలకు బ్రాడ్‌బ్యాండ్ సేవలు 2014లో ఏర్పాటైన ఐఐటిలకు మరిన్ని నిధులు విడుదల కేటాయింపులు బావుందని విశ్లేషకులు అభిప్రాయం.

## యూరియా కోసం యుద్ధం

### రైతు భరోసా కేంద్రాల్లో రైతుకు కన్పించని యూరియా - స్టాక్ తక్కువ వుండటంతో దుకాణాల వద్ద బారులు తీరిన రైతులు

చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జిల్లా రైతాంగానికి పంటలు సాగు చేసుకోవడానికి అవసరమైన ఎరువుల కష్టాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. రైతు పంట సాగుకు అవసరమైన ఎరువులు మండల కేంద్రాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో కన్పించకపోవడం, ఈ ఎరువుల కోసం రైతు ప్రైవేటు డీలర్ల వద్దకు వెళ్ళి క్యూ లైన్లలో నిలబడ్తుండటం, డీలర్ల వద్ద ఎరువుల స్టాక్ తక్కువగా వుండటంతో రైతుల్లో ఆందోళన పెరుగుతుంది. పంట సాగుకు అవసరమైన యూరియా లభ్యం అవుతుందో! లేదా! అని భావించిన రైతులు పెనుమూరు మండలంలో సోమవారం తెల్లవారుజాము 6 గంటల నుండి ఓ ఎరువుల డీలరు దుకాణం వద్దకు వచ్చి క్యూ లైన్‌లో నిల్చొని వుండటంతో జిల్లాలో ఎరువుల కొరత ఏ మేరకు వుందో తెలుస్తోంది. మిగిలిన మండలాల్లో సైతం రైతులు ఎరువుల కోసం అల్లాడుతున్నారు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులకు అవసరమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు అందుబాటులో వుంచి రైతులకు విక్రయించేవారు. అయితే ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాలు వున్నప్పటికీ ఆ కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులు రావడం లేదు. ఈ విషయంపై మండలాల్లో వ్యవసాయ అధికారులను ప్రశ్నిస్తే ప్రభుత్వం నుండి ఎరువులకు సంబంధించి ఎలాంటి సమాచారం లేదని, ఇకపై రైతు భరోసా కేంద్రాలకు వస్తాయని చెప్తున్నారని, అయితే ఎరువులు ఎప్పుడు వస్తాయి! అనేది మాత్రం కచ్చితంగా చెప్పలేమని పేర్కొంటున్నారు. ప్రైవేటు ఎరువుల డీలర్ల వద్ద రైతులకు అవసరమైన ఎరువులు పుష్కలంగా అందుబాటులో వుంటున్నాయని, రైతులు సైతం ప్రస్తుతం ప్రైవేటు ఎరువుల డీలర్ల నుండి ఎరువులు కొనుగోలు చేసి పంట సాగు చేస్తున్నారని మండల స్థాయి వ్యవసాయ అధికారులు పేర్కొంటున్నారు. పంటల సాగుకు అవసరమైన ఎరువులకు సంబంధించి రైతులు అత్యధికంగా యూరియా వినియోగిస్తారు. రైతు పండించే ప్రతి పంటకు యూరియా వినియోగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. అలాగే జిల్లాలో పశుపోషణ అధికంగా వుండటంతో పశువుల కోసం సాగు చేసే గ్రాస్ ఉత్పత్తికి యూరియా విరివిగా వినియోగిస్తారు. జిల్లాలో 25 వేల ఎకరాల విస్తీర్ణంలో ప్రస్తుతం పాడి రైతులు యూరియా అందుబాటులో వుందని, ఒక అర్ధ లీటరు నానో యూరియా కొనుగోలు చేసి నీళ్ళలో మిశ్రమం చేసి పంటకు వాడితే ఒక బస్తా యూరియా వాడినట్లన్నారు. అలాగే పంటలు సాగు చేసే రైతులకు మాత్రమే యూరియా విక్రయించాల్సి వస్తోంది, జిల్లాలో పశుపోషణ అధికంగా వుండటంతో పశుగ్రాసం సాగు చేయడం కోసం పాడి రైతులు యూరియాను అత్యధికంగా వినియోగిస్తుండటంతో కొంత డిమాండ్ కన్పిస్తోందన్నారు. జిల్లాలో ఎక్కడా యూరియా డిమాండ్ అనేది లేదని ఒకటి రెండు రోజుల్లో యూరియా సమస్యను పూర్తి స్థాయిలో పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.



పెనుమూరులో యూరియా కోసం తెల్లవారుజాము క్యూలైన్‌లో నిల్చొని ఎదురుచూస్తున్న రైతులు.

### ఇద్దరు సంఘమిత్రలు
## రూ.2.16కోట్లు స్వాహా

**-రూ.54లక్షల రికవరి మాత్రమే**
**-మంత్రులు, ఎంఎల్ఏకు వినతిపత్రాలు**

.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని తొట్టంబేడు మండలంలోని చియ్యవరం గ్రామంలో నిరుపేద సంఘమిత్రలు పొదుపు చేసుకున్న సొమ్ములు రూ.2.16కోట్లు ఇద్దరు సంఘమిత్రలు స్వాహా చేసినట్లు ఉన్నత స్థాయి విచారణలో తెటతెల్లమైన విషయం విదితమే. అయితే రూ.54లక్షలు రికవరి చేసినట్లు వివరించారు. గత కొద్ది కాలంగా ఇద్దరు నిర్వాహకులు పొదుపరుల నమ్మకాన్ని వమ్ము చేసి రాజకీయ ముసుగులో కోట్లు స్వాహా చేసారు. అయితే గతంలో కూడా విచారణలు జరిపినా రాజకీయ మద్దతుతో చర్యల్లేదు. ప్రస్తుతం మరో సారి విచారణ జరిపారు. స్వాహ వాస్తమేనని నిగ్గు తేల్చారు. తర్వాత తూతూ మంత్రంగా చర్యలుతీసుకున్నారు. అయితే శనివారం శివరాత్రి సమీక్షకు విచ్చేసిన దేవాదాయశాఖ, రెవెన్యూశాఖ మంత్రులకు మహిళా సంఘాల లీడర్లు వినతిపత్రాలుఇచ్చి తమ గోడును వెళ్ళబోసుకున్నారు. ఇద్దరు సంఘమిత్రలు చేతిన చేతివాటానికి బ్యాంకు అధికారులు తమకు నోటీసులు పంపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వెలుగు కార్యాలయంలో గతంలో ఎపిఎంగా ఉన్న గురుమూర్తి హయాంలో మండలంలోని సంఘమిత్రలుగా పనిచేస్తున్న మునిలక్ష్మి, మునిశేఖర్‌లు రూ.2.16కోట్లు స్వాహాచేసిన విషయం విదితమే. ఈనేపథ్యంలో విషయం బయటపడడంతో పత్రికల్లో వార్తలు రావడంతో జిల్లా కలెక్టర్ స్పందించి ఇక్కడి పంచాయతీల్లో అక్రమాలుపై విచారణ చేపట్టాలనిఆదేశించారు. ఒక్క చియ్యవరంలోనే కాకుండా గుండేలిగుంట, చోడవరం, కాసరం, రాంబట్లపల్లిలో ప్రత్యేక బృందాలు గతంలో విచారణ చేసి తూతూ మంత్రంగా ముగించారు.

**ప్రభుత్వ నిధులంటే లెక్కలేదు..**

, సిబ్బంది, సంఘమిత్రలు గ్రామాల్లో నిరక్షరాస్యులైన మహిళలను ఆసరాగా చేసుకుని వారి నిధులను స్వాహాచేస్తున్నారు. ఒక్క చియ్యవరం గ్రామంలోనే రూ.2.16కోట్లు స్వాహాచేశారంటే ఇందులో రూ.54లక్షలు రికవరీ చేశారు. మిగిలిన నగదు ఎప్పుడు చెల్లిస్తారో తెలియడం లేదు. దీంతో గ్రామంలో ఉన్న మహిళలకు బ్యాంకు అధికారులు నోటీసులు పంపుతున్నారని మంత్రులు,ఎంఎల్ఏకు తెలిపారు.

### మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించిన
## మంత్రులు, అధికారులు



నిత్యాన్న ప్రసాదంలో భక్తులకు భోజనం వడ్డిస్తున్న మంత్రి ఆనం

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే శివయ్య బ్రహ్మోత్సవాల ఏర్పాట్లును శనివారం రాష్ట్ర రెవెన్యూ,స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్,జిల్లా ఎస్పి హర్షవర్ధన్ రాజులతో కలసి పరిశీలించారు. ఈ ఏడాది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లును స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఆలయ ఇఓ టి.బాపిరెడ్డి, ఇఇ మురళీధర్‌రెడ్డి, డెప్యూటి ఇఓ ఎన్ ఆర్ కృష్ణారెడ్డిలు అడుగడుగునా చేపట్టిన ఏర్పాట్లును వివరించారు. క్యూలైన్లకు సంబంధించి అధికారులు ఐదు లైన్లుగా ఏర్పాటు చేసినట్లు వివరించారు. అమ్మవార్లను దర్శించుకున్న వారు బయ టికి భక్తుల్ని పంపే మార్గం కన్నప్ప కొండపైకి వెళ్ళుదారిని పరిశీలించారు.

**అన్నదానంలో భోజనం వడ్డించిన మంత్రులు:**

శ్రీ జ్ఞాన ప్రసూనాంబసమేత శ్రీకాళహస్తీశ్వరుని దర్శించుకున్న మంత్రులకు గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకా శీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను శాసన సభ్యుడు సుధీర్‌రెడ్డి అందించారు. ఆలయంలో అమలు జరుగుతున్న నిత్యాన్న ప్రసాదంలో భోజనాలను రుచి చూసి భక్తులకు సేవలందించారు. వారితో పాటు మాజీ శ్రీకాళహస్తి మార్కెటింగ్ కమిటి చైర్మెన్స్ రంగినేని చెంచయ్యనాయుడు చెలికం పాపిరెడ్డి,జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, మాజీ పాలసరఫరాసంఘ చైర్మెన్ రావిళ్ళ మునిరాజా నాయుడు, గురువాంరెడ్డి, షాకిర్ అలి,కృష్ణమనాయుడు, విజయకుమార్ నాయుడు, నరసింహాయాదవ్ తెలుగుదేశంనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## శివరాత్రి నిర్వహాణకు 'సేవా కమిటి'

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమయ్యే మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలకు 'సేవా కమిటిని' నియమించనున్నట్లు రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ప్రకటించారు. శనివారం శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చిన ఆయన జిల్లాలోని వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులతో చర్చించారు. తరువాత శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన ట్రస్టుబోర్డు నియామకానికి సంబంధించి ప్రశ్నించగా రాష్ట్రంలోని దేవాలయాలకు పాలకమండళ్ళ నియామకంలో కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఏర్పడ్డాయని కాబట్టి శ్రీకాళహస్తీశ్వరాయంలోని శివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేకంగా 20 మందితో నామినేట్ చేయనున్నట్లు మంత్రి ప్రకటించారు. కాగా ఇక్కడి శివరాత్రి బ్రహ్మోత్సవాలను సమర్థవంతంగా పర్యవేక్షించుటకు తిరుపతి మున్సిపల్ కమిషనర్‌ను ప్రత్యేకాధికారిగా నియమించనున్నట్లు మంత్రి వివరించారు.

**సిఎంను ఆహ్వానించాము:**

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ప్రభుత్వం నుంచి పట్టు వస్త్రాలు సమర్పించే సంప్రదాయం ఉందని ఈ సారి సిఎం సొంత జిల్లాలో ఉన్న పెద్ద ఆలయం శ్రీకాళహస్తీశ్వరాలయానికి పట్టు వస్త్రాలను సమర్పించుటకు ఆహ్వానించామని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి వివరించారు. ఆయనతో పాటు రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ఉన్నారు.

### జనవరి 8న ఘటనపై విచారణకు
## తిరుపతిలో విశ్రాంత జడ్జి



తిరుపతి,జనవరి 25ప్రభాతవార్త: పదిరోజుల వైకుంఠద్వార దర్శనాలకు ఆఫ్‌లైన్‌లో టైమ్‌స్లాట్ టోకెన్లుజారీకి ముందే తిరుపతిలో జనవరి 8రాత్రి జరిగిన ఘటనపై న్యాయవిచారణకు విశ్రాంత జడ్జి జస్టీస్ సత్యనారాయణమూర్తి తిరుపతికి చేరుకున్నారు. ఆయన తొలుత శనివారం ఉదయం తిరుమలకు వెళ్ళి ఏడుకొండల వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన తిరుపతికి వచ్చారు. తిరుపతిలో జనవరి 8వతేదీ రాత్రి బైరాగిపట్టెడ పద్మావతిపార్కు, శ్రీనివాసం, విష్ణునివాసంలో భారీ రద్దీకి తగ్గట్లు సరైన ఏర్పాట్లు, భక్తుల నియంత్రణ చర్యలు తీసుకోవడంలో భద్రత యంత్రాంగం ఎలా వ్యవహరించిందనే కోణంలో ఆరాతీస్తున్నారు. భక్తుల రద్దీ అనూహ్యంగా ఉంటుందని ముందుగానే తెలిసినా అందుకు అవసరమైన జాగ్రత్త చర్యలు తీసుకోవడంలో ఎవరి నిర్లక్ష్యం, ఎవరి తప్పిదమనేది ఇప్పుడు విశ్రాంత న్యాయమూర్తి జస్టీస్ ఎం.సత్యనారాయణమూర్తి విచారణలో తేలనున్న అంశం. రాత్రి సమయంలో ఒక్కసారిగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనపై లోతుగా టిటిడి అధికారులను, భద్రతా విధుల్లో ఉన్నటువంటి పోలీసులను, రెవెన్యూ ఉద్యోగులను,ప్రత్యక్షసాక్షులను ఆయన విచారణ చేసే అవకాశం కనిపిస్తోంది. శనివారం పద్మావతి విశ్రాంతి భవనంలోనే ఆయన ఉండి దీనికి సంబంధించి ఇప్పటికే నమోదైన కేసుల ఎఫ్ఐఆర్‌ను పరిశీలించినట్లు తెలుస్తోంది. కుట్రపూరితంగా జరిగిందా?లేక ఉన్నఫళంగా భక్తుల రద్దీనేపథ్యంలో చోటుచేసుకుందా అనేది న్యాయవిచారణ జస్టీస్ సత్యనారాయణమూర్తి తేల్చనున్నారు.

## వెటర్నరీ వైద్య విద్యార్థుల గౌరవ వేతనం పెంచాలి

తిరుపతి విద్య ఫిబ్రవరి 1 ప్రభాత వార్త



వెటర్నరీ వైద్య విద్యార్థుల గౌరవ వేతనం విషయంలో అధికారులు దారుణంగా వ్యవహరిస్తున్నారని, వెంటనే స్టైఫండ్ ను పెంచాలని ఎస్వీ వెటర్నరీ కళాశాల విద్యార్థులు డిమాండు చేశారు. ఇందులో భాగంగా శనివారం కళాశాల ఎదుట ప్లేకార్డులు చేతబూని న్యాయం చేయాలని నినదిస్తూ మెరుపు సమ్మెకు దిగారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఎంబీబీఎస్ విద్యార్థులకు నెలకు రూ. 27వేలతో పాటు టీఏ, డీఏలు వసతి సౌకర్యాలు కల్పిస్తున్నారని, ఇంటర్న్షిప్ చేస్తున్న బీవీఎస్సీ, ఏహెచ్ విద్యార్థులకు కేవలం నెలకు రూ. 7వేలు గౌరవ వేతనం చెల్లించడం దారుణమన్నారు. వెటర్నరీ వైద్య విద్యార్థులను ప్రభుత్వం చిన్నచూపు చూడటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయుర్వేదిక్, హోమియోపతి, బీడీఎస్ విద్యార్థులకు సముచిత గౌరవవేతనం ఇస్తున్నారని, తమ పట్ల వర్సిటీ అధికారులు వ్యవహరిస్తున్న తీరు అభ్యంతరకరమన్నారు. ఎంబీబీఎస్ పీజీ విద్యార్థులకు నెలకు రూ. 50వేలు స్టైఫండ్ ఇస్తుంటే, వెటర్నరీ పీజీ విద్యార్థులకు కేవలం రూ. 9వేలు ఇస్తున్నారని మండిపడ్డారు. + వెంటనే గౌరవవేతనాన్ని రూ. 30వేలకు పెంచి ఇంటర్న్షిప్ చేసే విద్యార్థులకు మౌళికవసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించని పక్షంలో విధులను బహిష్కరించి పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం వీసీకి వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నాలో ఎస్వీ వెటర్నరీ కళాశాలకు చెందిన యూజీ, పీజీ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

## అవిలాల చెఱువులో అభివృద్ధి పనులు



-చెఱువులో ముళ్ల చెట్టు తొలగింపుకు జంగిల్ క్లియరెన్స్

-మినీ ఎకోలాజికల్ పార్క్ దిశగా అడుగులు

తిరుపతిరూరల్, ఫిబ్రవరి 01 ప్రభాతవార్త:

ముళ్ల పొదలు, మురుగు కుంటలు, బహిరంగ మలవిసర్జన, అసాంఘీక కార్యకలాపాలకు అడ్డగా ఉన్న అవిలాల చెఱుకు కూటమి ప్రభుత్వంలో మహర్దశ రానున్నది. గత వైసిపి ప్రభుత్వంలో అవిలాల చెఱువును పూర్తిగా గాలికి వదిలేసారు. తిరుపతి నగరానికే ఒక అసెట్గా ఉన్న చెఱువులో అభివృద్ధి చేయటానికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్దం చేస్తుంది. ఈ మధ్య కాలంలో తిరుపతిజిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ నేతృత్వంలో తుడా, ఇరిగేషన్ అధికారులు ఆర్కిటెక్ నిపుణులతో సమావేశమై చెఱువు అభివృద్ధిపై చర్చించారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటి) నిబంధనలు, ఆదేశాల మేరకు చెఱువును వినియోగంలోకి తీసుకురావటానికి కసరత్తు చేస్తున్నారు. ఎన్జీటి ఆదేశాలకు ఎలాంటి భంగం వాటిల్లకుండా జలాశయాలకు ఎలాంటి ఆటంకం కలగకుండా కాంక్రీట్ ట్రాక్నను ఏర్పాటు చేయాలని ప్రాధమిక నిర్దారణకు వచ్చారు. టిటిడి భాగస్వామ్యంతో అవిలాల చెఱువులో మనీ ఎకోలాజికల్ పార్క్ను ఏర్పాటు చేయనున్నారు. అవిలాల చెఱువు దాదాపుగా 201 ఎకరాలలో విస్తీర్ణంలో ఉండగా జాతీయ రహదారికి, ఇతర రోడ్లుకు పోగా ప్రస్తుతం 180 ఎకరాలు మాత్రమే ఉంది. అందులో కేవలం 16 ఎకరాలు మాత్రమే ఉద్యానవనంగా అందుబాటులోకి తీసుకురానున్నారు. చెఱువుకు పడమర వైపు అభివృద్ధి చేసి, మిగత భాగాన్ని చెఱువుగానే ఉంచనున్నారు. చెఱువు చుట్టూ దాదాపుగా 2.5కిలో మీటర్లు వరకు కట్టను దృఢంగా నిర్మించనున్నారు. ఈ కట్టనే వాకింగ్ ట్రాక్గా అభివృద్ధి చేయనున్నారు.

## శివయ్య సేవలో హైకోర్టు జడ్జి:

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో శనివారం రాష్ట్ర హైకోర్టు జడ్జి వెంకట జ్యోతిర్మయి పాల్గొన్నారు. ఆమెకు ఆలయ మర్యాలతో దక్షిణ గోపురం వద్ద ప్రోటోకాల్ ఎఇఒ విద్యాసాగర్రెడ్డి, పిఆర్ఓ రవిలు వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్లను దర్శించుకున్న ఆమెకు దక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందించారు. స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## సిసి కెమెరాలు: డ్రోన్లు ఏర్పాటు:పార్కింగ్కు ప్రత్యేక స్థలం



**శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో ఈ సారి ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టనున్నట్లు జిల్లా ఎస్పి హర్షవర్ధన్రాజు వివరించారు. వరుస సంఘటనలతో పోలీసులు అప్రమత్తమయ్యారు. శనివారం జరిగిన సమీక్షలో వర్షవర్ధన్రాజు కొన్ని ప్రతిపాదనలు సూచించారు. ముఖ్యంగా పట్టణంలో సుమారు 400 సిసి కెమెరాలు ఏర్పాటు చేసి కంట్రోల్ రూంను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అలాగే 14 సంవత్సరాల లోపు పిల్లలకు జిపిఎస్ ఆధారిత ట్రాకింగ్ బ్యాండ్ ఏర్పాటుకు ఆదేశించారు. కాగా వచ్చిన భక్తుల పట్ల పోలీసులు అన్ని శాఖల అధికారులు మర్యాదపూర్వకంగా మాట్లాడాలని, క్యూలైన్లలో పిల్లలకు వృద్దులకు పాలు, నీరు, బిస్కెట్లు ఏర్పాటుకు ప్రతిపాదించారు. భక్తులకు సురక్షితమైన సులభమైన దర్శనానికి మార్గదర్శకాలు వివరించారు. కాగా 27వ తేది ప్రతి ఒక్కరికి 'ఉచిత దర్శనం' ఉంటుందన్నారు. అలాగే 13రోజుల పాటు భక్తులను కంటికి రెప్పలా కాపాడుటకు తమ శాఖ జవాబుదారి తనంతో పని చేస్తుందన్నారు. ప్రవేశ, నిష్కరమణ గేట్ల వద్ద భక్తులు పూర్తి సమాచారం తెలిసేలా హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేస్తామని వివరించారు. కళ్యాణోత్సవం రోజు బాల్యవివాహాలు జరగకుండా మహిళా సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేస్తున్నట్లు స్కిట్ కళాశాల ఆవరణలో పార్కింగ్ ఏర్పాటు చేస్తామని అందుకు సంబంధించి శాసనసభ్యుడు సుధీర్రెడ్డితో కలసి పరిశీలించారు. ఈ కార్యక్రమాల్లో డియస్పిలు గిరిధర్, నరసింహామూర్తి, సిఐలు గోపి, వెంకటేశ్వర్లు, తిమ్మయ్య, ఎస్ఐలు సుధాకర్రెడ్డి, ఈశ్వరయ్య, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## బాలికల హాస్టళ్ల మరమ్మతులు చేపట్టండి

ఎమ్మెల్యే ఆదేశాలు



**పుత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :** పుత్తూరు మండలంలోని పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ బిసి బాలికల హాస్టళ్ల మరమ్మతులు చేపట్టాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ తిరుపతి జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి చంద్రశేఖర్ను ఆదేశించారు. శనివారం తనను కలిసిన సంక్షేమ శాఖాధికారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలన్నారు. అలాగే పుత్తూరు, వడమాలపేట మండలాల్లో బిసి కమ్యూనిటీ హాల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు రూపొందించి అవి మంజూరయ్యేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

## ఘనంగా స్కూల్ స్పోర్ట్స్ డే వేడుకలు

.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త




స్థానిక జయరామారావువీధిలోని శ్రీచైతన్య పాఠశాలలో స్కూల్ స్పోర్ట్స్ డే దినోత్సవ వేడుకలును ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ప్రీప్రైమరీ విద్యార్థులకు వివిధ రకాల క్రీడలు నిర్వహించి వారికి బహుమతులను అందించారు. ఎజిఎం సురేష్ ముఖ్యఅతిథిగా విచ్చేయగా తమ పాఠశాలలో ఉన్నత విలువలతో కూడిన విద్యతో పాటు అన్ని రంగాల్లో విద్యార్థులు తీర్చిదిద్దుతు న్నామన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపల్ సుధాకర్, ఏఓ శివ, డీన్ శంకర్, సి. బ్యాచ్ ఇన్ఛార్జి గిరిజ, ప్రైమరీ ఇన్ఛార్జి మాధవీల, ప్రీప్రైమరీ ఇన్ఛార్జి గౌరి తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో ఫించన్లు పంపిణీ

.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్రెడ్డి ఆదేశాల మేరకు కూటమి ప్రభుత్వంలో ప్రతినెల ప్రభుత్వం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ భరోసా ఫించన్లు పంపిణీ కార్యక్రమంలో కొణతనేరి, ఇలగనూరు పంచాయతీల్లో ఫించన్లు పంపిణీ కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు ఆధ్వర్యంలో పంపిణీచేశారు. ఈసందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి సంతకం ఫించన్లపైనే సిఎం సంతకం పెట్టారని దశలవారీగా కాకుండా ఒకే సారి పెంచారన్నది ప్రతి ఒక్కరు గుర్తించుకోవాలన్నారు. కార్యక్రమంలో పలువురు నాయకులుపాల్గొనారు.

## కేంద్ర బడ్జెట్పై బిజెపి నేత కోలా హర్షం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త

కేంద్ర బడ్జెట్ కేటాయింపులపై బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా. ఆనంద్కుమార్ హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశాన్ని ప్రపంచంలో అతిపెద్ద వికసిత్ భారత్గా నిర్మితమైన బడ్జెట్ అని కొనియాడారు. పేదలు, రైతులు, మహిళలు, యువకులు అభివృద్దే లక్ష్యంగా రూపొందించిన బడ్జెట్ అని తెలిపారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్రబడ్జెట్పై ఆయన మాట్లాడుతూ ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో 3.0 ప్రభుత్వంలో రెండోసారి ప్రజారంకమైన వార్షిక బడ్జెట్ను ప్రవేశపెట్టారని ఇది మంత్రి ప్రవేశపెట్టిన 8వ బడ్జెట్ అన్నారు. దేశ వ్యాప్తంగా అన్ని ప్రాంతాలు, అన్ని వర్గాలు అభ్యున్నతి, అభివృద్దే ధ్యేయంగా ఉండేందుకు ఇదే నిదర్శనం అన్నారు. 2047కి ప్రపంచంలో అతిపెద్ద దేశంగా అవతరిస్తుందన్నారు. పోలవరం నిర్మాణంకోసం, రాజధాని అమరావతి, రైల్వేలు, జాతీయ రహదారులు, విశాఖ స్టీల్ప్లాంట్, విమానాశ్రయాలు పునరుద్దరణ తదితర అంశాలు దృష్టిలో పెట్టుకుని రాష్ట్రానికి అశాజనకమైన బడ్జెట్గా కోలా ఆనంద్ సంతోషం వ్యక్తం చేశారు.

## ఘనంగా స్విమ్స్లో నిరంతర వైద్య విద్య

తిరుపతి హెల్త్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త ః



స్విమ్స్ ఈఎన్టీ, ఆప్తల్మాలజీ, డెంటిస్ట్రీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం శ్రీ పద్మావతి ఆడిటోరియంలో ఘనంగా నిరంతర వైద్య విద్యా కార్యక్రమం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్విమ్స్ శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషా కళావత్, డెంటిస్ట్రీ విభాగాధిపతి డాక్టర్ మధుబాబు, ఆప్తమాలజీ విభాగాధిపతి డాక్టర్ ప్రభంజన్ కుమార్, ఈఎన్టీ విభాగాధిపతి డాక్టర్ అమర్ నాథ్, న్యూక్లియర్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ కళావత్ సంయుక్తగా జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు స్విమ్స్లో రోగులకు ఇస్తున్న మెరుగైన వైద్య పరీక్షలను పవర్ పాయింట్ ద్వారా విశదీకరించారు. డాక్టర్ నరేంద్ర, సీనియర్ ఇన్ఎన్టీ ఆప్తల్ మాలజీ, ర డెంటల్ వైద్యులు, పీజీ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ పరిశీలిస్తున్న - సీఈవో

విజయపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అందిస్తున్న సామాజిక భద్రత పింఛన్లలో భాగంగా శనివారం మండలంలో జరుగుతున్న పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని చిత్తూరు జడ్పీసీఈవో రవికుమార్నాయుడు పరిశీలించి, ఒకరిద్దరి లబ్ధిదారులకు ఆయనే స్వయంగా అందించారు. ఈ సందర్భంగా పింఛన్లు పంపిణీపై స్పందనను లబ్ధిదారులను వారు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఇళ్ళత్తూరు సమీపంలో కుశస్థలీనదిలో మండలంలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్న మంచి నీటి ప్రాజెక్టును సందర్శించారు. వీరితో పాటు డీఎల్డీవో రవికుమార్, ఎంపీడీవో రాజేంద్ర, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విజయపురం ఐటీఐలో జాబ్మేళా

విజయపురం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

విజయపురం మండలం పన్నూరు సబ్స్టేషన్ ఐటీఐలో ఫిబ్రవరి 3 ఉదయం 10 గంటలకు జాబ్మేళా నిర్వహించడం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపాల్ గణేష్ శనివారం తెలిపారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు జాబ్మేళా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జాబ్మేళాలో పలు కంపెనీలు హాజరు కానున్న నేపథ్యంలో ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు తమ అర్హతలకు సంబంధించిన సర్టిఫికెట్లతో పాటు, ఆధార్కార్డు రెండు పాస్పోర్టు సైజు ఫోటోలు తీసుకుని జాబ్మేళాకు హాజరు కావాలని తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘంలోగా ఆవిష్కరణ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల నూతన సంఘ లోగోను ఉద్యోగ సంఘాలు రూపకల్పన చేసారు. ఈ లోగోను శనివారం శ్రీకాళహస్తి మున్సిపల్ కార్యాలయం సమావేశం హాలులో రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆవిష్కరించారు. ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమంతో పాటు ఉద్యోగుల ప్రత్యక్ష సామాజిక సేవ చేయాలనే లక్ష్యంతో ఏర్పడ్డ ఈ సంఘానికి మంత్రులు, జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా నూతన సంఘం లోగోను రూపకల్పన చేసారు. దానిని రెవెన్యూ మంత్రి అనగాని సత్య ప్రసాద్, శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో డెప్యూటీ తహశీల్దార్, ఉపాధ్యక్షుడు స్వామి నాధన్, ప్రధాన కార్యదర్శి కిరణ్కుమార్, సంయుక్త కార్యదర్శి గోవర్ధన్ యాదవ్, కార్యనిర్వాహక కార్యదర్శి ఏ.కె ప్రేమ్కుమార్, కోశాధికారి మోహన్బాబు, కార్యవర్గ సభ్యులు అమృత, ఎంపికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## మార్కెట్ కమిటి చైర్మెన్గా తాటిపర్తి ఈశ్వరరెడ్డి?!

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గంలో నామినేటెడ్ పదవుల జాతర ప్రారంభం కానుంది. శనివారం రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, దేవాదాయ శాఖ మంత్రి ఆనం నారాయణరెడ్డిలు శ్రీకాళహస్తి పర్యటనకు వచ్చారు. ఈ సందర్బంగా ఊరందూరు గ్రామంలో పదవులు ఆశిస్తున్న వారితో సందడిగా మారింది. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో సీనియర్గా ఉన్న తాటిపర్తి ఈశ్వర్రెడ్డి మంత్రులతో కలసి స్వాగతం పలికారు. పార్టీని నమ్ముకొని ఉన్నామని మంత్రుల దృష్టికి తెచ్చారు. పదవుల గురించి ప్రస్తావన రాగా శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి పగ్గాలను ఈశ్వర్రెడ్డి భార్యకు ఇవ్వాలనే ప్రతిపాదన ఉండగా ఈశ్వర్రెడ్డి మంత్రులతో ఆమె ఆరోగ్య రీత్యా తనకే అవకాశం కల్పించాలని కోరగా మంత్రులు సుముఖంగా స్పందించారు.

## ప్రతి ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

తిరుపతి విద్య ఫిబ్రవరి 1, ప్రభాతవార్త:



ఎస్వీయూ లో కల్చరల్ అఫైర్స్ విభాగం, సెట్విన్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ రూల్స్ పై జరిగిన సదస్సులో రూల్స్ పై అవగాహన పెంచుకొని, వాటిని విధిగా పాటించాలని వక్తలు కోరారు. వారు మాట్లాడుతూ యువత, విద్యార్థులు డ్రైవింగ్ లైసెన్స్ పొందాలని, అదేవిధంగా ప్రభుత్వం సూచించిన ట్రాఫిక్ రూల్స్ ను పాటించాలని తర్వాత జరిగే చట్టపరమైన చర్యలు తో బాధపడవద్దని వక్తలు హెచ్చరించారు. రూల్స్ అతిక్రమించి ప్రాణాల మీదకి కూడా తెచ్చుకోవద్దని వారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ యు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుధారాణి, ఆచార్య మురళీధర్, డాక్టర్ పత్తిపాటి వివేక్, ట్రాఫిక్ సిఐ సంజీవ్ కుమార్, సెట్విన్ సీఈవో మోహన్ కుమార్, వర్సిటీ విద్యార్థిని విద్యార్థులు, పరిశోధకులు, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందిపాల్గొన్నారు.

## జాతీయ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

తిరుపతి విద్య ఫిబ్రవరి 1 ప్రభాత వార్త



పద్మావతి మహిళా విశ్వావిద్యాలయం, ఆంగ్ల శాఖ ఆధ్వర్యంలో ఖిరీసెంట్ డిసిప్లేనరీ ట్రెండ్స్ టువార్డ్స్ సోషల్ ట్రాన్స్ఫర్మేషన్ఖి అనే అంశంపై మార్చి 21వ తేదీ నుంచి రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సుకు సంబంధించిన పోస్టర్లను వీసీ ప్రొఫెసర్ ఉమ, రిజిస్ట్రార్ రజని శనివారం ఆవిష్కరించారు. ప్రస్తుత సాంకేతిక ప్రపంచం లో నెలకొన్న స్థితిగతుల గురించి వివిధ రంగాలలో జరుగుతున్న పరిశోధనలు, తద్వారా వస్తున్న సామజిక మార్పుల విజ్ఞానాన్ని అందరు పంచుకోవాలనే ఉద్దేశ్యంతో నిర్వహిస్తున్నట్లు ఆంగ్లశాఖ విభాగాధిపతి ఆచార్య శారద తెలిపారు.

## తుడా టవర్స్ నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలలో రాజీపడొద్దు

తుడా ఉపాధ్యక్షులు ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 1, ప్రభాతవార్త



తుడా ఆధ్వర్యంలో రాయలచెరువు రోడ్డులో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణల్లో నాణ్యత ప్రమాణాలు పాటించడంలో రాజీ పడొద్దని తుడా ఉపాధ్యక్షులు, నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులను, నిర్మాణ సంస్థ ప్రతినిదులను ఆదేశించారు. శనివారం నగరంలోని రాయల్ చెరువు రోడ్లో నిర్మిస్తున్న తుడా టవర్స్ నిర్మాణ పనులను ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం తుడా కార్యాలయంలో అధికారులతో సమావేశమై సమీక్షించారు. ఈ సందర్బంగా ఉపాధ్యక్షురాలు మౌర్య మాట్లాడుతూ ప్లాన్ ఎలివేషన్ తదితర అంశాలపై అధికారులకు తగు సూచనలు చేశారు. ఇచ్చిన గడువులోపు పనులు పూర్తి చేయాలని అన్నారు. వీలైనంత త్వరలో పనులు చేస్తే విక్రయానికి వేలం నిర్వహించేందుకు వీలుంటుందని అన్నారు. ఈ సమావేశంలో సెక్రటరీ వెంకటనారాయణ, సూపరింటెండెంట్ ఇంజినీర్ కృష్ణారెడ్డి, అడ్వైజర్ రామకృష్ణ రావు, డిఈ భాషా, ఏఈ షణ్ముగం, కెపిసి సంస్థ ఈడి సుశీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మంత్రులను సత్కరించిన పట్టణాధ్యక్షుడు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



పట్టణంలో ఈనెల నుంచి జరిగేమహాశివరాత్రి ఉత్సవాలపై సమీక్ష సమావేశానికి హజరైన తిరుపతి జిల్లా ఇన్ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ మరియు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిలను పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్ ఎంఎల్ఏ బొజ్జలవెంకటసుధీర్రెడ్డి స్వగృహంలో కలసి దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈసందర్భంగా బ్రహ్మోత్సవాలకు సంబందించి అందరు సమిష్టికృషితో విజయవంతం చేయాలని విజయకుమార్కు సూచించారు.

## ఉల్లాసంగా ఉత్సాహంగా నోబ్యాగ్ డే

**.తొట్టంబేడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త** మండలంలోని దిగువసాంబయ్యపాళెం ప్రాధమిక పాఠశాలలో విద్యార్థులు వివిధ కార్యక్రమాలతో నో బ్యాగ్డే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు బాలసుబ్రమన్యం మాట్లాడుతూ చదువుతో పాటు విద్యార్థులు అనేక నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని ఇష్టంతో బడికి రావాలని దానికి ఇలాంటి కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తయారు కావాలని దానికి వేదిక ప్రభుత్వ పాఠశాలలే అన్నారు. అనంతరం విద్యార్థులు ఆటలు, పాటలుతో పాటు బొమ్మలుతో మాస్కులు తయారు చేసి ప్రదర్శించారు. కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్ మోహన్రాణి, వర్కర్ మాధవి తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ఇంటి వద్దకు ఎన్టిఆర్ భరోసా పెన్షన్లు అందించిన మంత్రులు

ఊరందూరు గిరిజన కాలనిలో పంపిణి

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం ఊరందూరు గ్రామ గిరిజన కాలనీలో శనివారం పొద్దుపొడవక ముందే రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామ్నారాయణ రెడ్డి, శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్రెడ్డి, జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్లు ఎన్టిఆర్ భరోసా పెన్షన్లను అందించారు. ప్రతి నెల 1వ తేది పొద్దుపొడవకముందే నిరుపేదలకు అందించే ఎన్టిఆర్ భరోసా పెన్షన్లను అందిస్తున్నారు. ఈ నెల పెన్షన్లను ఊరందూరు గ్రామ గిరిజన కాలనీలో అందించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన దిశగా ఎన్టిఆర్ సామాజిక భద్రత పెన్షన్లు అర్హులైన లబ్దిదారులకు పంపిణి చేసి నిరుపేదలకుఅ ఒడగా నిలుస్తుందన్నారు. మంత్రులు తెలుగుదేశం పార్టీ నాయకులు గిరిజనుల ఇంటివద్దకు వెళ్ళటంతో వారి సంతోషానికి అవధుల్లేదు. వారితో ఆప్యాయంగా మాట్లాడుతూ నారాచంద్రబాబునాయుడు అందిస్తున్న పెన్షన్ల గురించి వివరించారు. అలాగే ఊరందూరు దళిత వాడలో పి. సుబ్బమ్మ , జి. లక్ష్మమ్మ, బి. లచ్చమ్మ, లకు వితంతు పెన్షన్లు టి. పోలయ్యకు వృద్ధాప్యపు పెన్షన్ కె. గోపాల్కు విభిన్న ప్రతిభావంతునికి దివ్యాంగుల పెన్షన్ను అందించారు. ఈకార్యక్రమాల్లో ప్రాజెక్టు డిఆర్డిఏ వెలుగు శోభన్బాబు, ఎంపిడిఓ రఫీ, సచివాలయ సిబ్బంది, మాజీ మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యానాయుడు, జడ్పిటిసి సుబ్బారెడ్డి, రవీంద్ర, విజయకుమార్నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమం, అభివృద్ధి అమలు తెలుగుదేశంతోనే సాధ్యం :

నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని జడ్పీటీసీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్కుమార్ తెలిపారు. శనివారం మండలకేంద్రంలోని నారాయణవనం పంచాయతీ కార్యాలయం ఆవరణలో ఫించన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామి మేరకు ఎన్టీఆర్ భరోసా ఫించన్ పంపిణీతో నిరుపేదల కళ్లలో ఆనందం వ్యక్తమవుతుందన్నారు. భవిష్యత్తులో ఏపి అభివృద్ధి కేవలం చంద్రబాబు, లోకేష్తోనే సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు ఎన్ భాస్కరన్, ఎ హరి, సర్పంచ్ కెజి శారదమ్మ గణేషన్, ఇఒ కెపి షణ్ముగం, పెద్ద ఎత్తున టిడిపి కార్యకర్తలు, అభిమానులు, మహిళలు పాల్గొన్నారు.

## గోవిందమాల పాదయాత్ర భక్తులకు అన్నదానం

నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త :



తమిళనాడు రాష్ట్రం చెన్నైలోని మీంజూరు గ్రామానికి చెందిన సుమారు 50 శ్రీవారి గోవిందమాల పాదయాత్ర భక్తులకు అదే గ్రామానికి చెందిన దాత సుందరపెరుమాల్, మునిలక్ష్మీ దంపతులు శనివారం నారాయణవనంలో ఉచిత అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నారాయణవనం మేజర్ పంచాయతీలోని దూండి వినాయకుని ఆలయంలో శనివారం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం అందించారు. ప్రతి ఏడాది భక్తులకు ఉచితంగా అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు దాతలు, వారి కుటుంబసభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పి గోవిందస్వామి, ఎపి భక్తవత్సలం, నాయకులు పిజి ముకేష్, కె విజయకుమార్(ఇషాక్), ఎన్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ వేంకటేశ్వరునికి ఘనంగా ఊంజల్సేవ

***నారాయణవనం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త*** నారాయణవనంలోని కల్యాణవెంకటేశ్వరుని ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. అంతకు ముందు అమ్మవారిని, స్వామివారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి, పుణ్యవచనం, గంట, అర్చన, బలి, తోమాలసేవ, నిత్యకైంకర్య పూజ కార్యక్రమాల అనంతరం సుగంధద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం దర్శన భాగ్యం కల్పించారు. సాయంత్రం తిరుచ్చివాహనంపై అదిరోహించిఊరేగించారు. నాగరాజు, ఆర్జితంఇన్స్పెక్టర్ భరత్, సిబ్బంది కైలాసం, అర్చకులు పాల్గొన్నారు.

## గుడి, బడి ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఖబడ్దార్ : సిఐ

చంద్రగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



గుడి, బడి, ప్రభుత్వ కార్యాలయ ఆవరణాలు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే ఖబడ్దార్ అంటూ సిఐ సుబ్బరామిరెడ్డి హెచ్చరించారు. తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు.. స్థానిక కావమ్మ గుడి ప్రాంగణం, మార్కెట్ యార్డ్ గోడౌన్, బ్రహ్మంగారి గుడి పరిసరాలను శనివారం అధికారులు క్లీనింగ్ చేశారు. ఈ క్రమంలో ఆయా ప్రదేశాలలో మద్యం బాటిళ్ళు, ప్లాస్టిక్ కవర్లు కుప్పలు తెప్పలుగా పడివుండటంతో అవాక్కయ్యారు. ముఖ్యంగా మద్యం బాటిళ్ళను పగులగొట్టివుండటం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆయా ప్రదేశాలలో పోలీసు వారి హెచ్చరికలతో కూడిన ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. తమ సిబ్బంది నిరంతర పర్యవేక్షణతో గస్తీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎవరైనా మద్యం సేవిస్తూ పట్టుబడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఎంపిడిఓ శేఖర్, ఈఓ మహేశ్వరయ్య, టిడిపి నాయకులు మొక్కల కుమార్రాజారెడ్డి, వీరంగారి రమేష్ రెడ్డి, గౌస్భాషా, ఏజి పల్లి బాల, కాలూరు ప్రసాద్, విఆర్ఓ విష్ణువర్ధన్, పురుషోత్తం, పాల్గొన్నారు.

## తిరుచ్చి వాహనంపై "శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు"

చంద్రగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



శ్రీనివాస మంగాపురంలో వెలసియున్న కల్యాణ వెంకటేశ్వర స్వామి వారి ఆలయంలో శనివారం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు తిరుచ్చి వాహనంపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను అనుగ్రహించారు. సాయంత్రం శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుడు ఉత్సవమూర్తులను వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు, బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి తిరుచ్చి వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ స్వామివారు తన దేవేరులతో ఆలయ తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం. గోపినాద్, సూపరింటెండెంట్ వల్లంశెట్టిరమేష్బాబు, డిఈఈభాస్కర్, ఏఈఈ బాలకృష్ణమూర్తి, ఆర్జితం ఇన్స్పెక్టర్ అనుంబట్లు ధనశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## పెన్షన్ల పెంపు .. సంతృప్తికర జీవనం

చంద్రగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



పెన్షన్ల పెంపుతో సంతృప్తికరమైన జీవనాన్ని గడుపుతున్నట్లు వృద్ధులు, వికలాంగులు, అనారోగ్య బాధిత పీడితులు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఎంఎల్ఏ పులివర్తి నాని అన్నారు. మండల పరిధిలోని ఎం. కొంగరవారిపల్లిలో శనివారం ఎంఎల్ఏ ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ అవ్వ తాతలకు కూటమి ప్రభుత్వం అండగా వుంటుందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ వాటన్నింటినీ అధిగమించి క్రమం తప్పకుండా 1వ తారీఖునే పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ సంపూర్ణ సహకారం, ఆశీస్సులతో నియోజకవర్గాన్ని అన్నిరకాలుగా అభివృద్ధి చేయడానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు.

## గెంజి శాంతమ్మకు చెవిరెడ్డి నివాళి

చంద్రగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:



మండల పరిధిలోని శానంబట్లలో వైసిపి నాయకుడు దివంగత గెంజి మణికుమార్ రెడ్డి తల్లి గెంజి శాంతమ్మ భౌతిక కాయానికి వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి నివాళులర్పించారు. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఆరోగ్యంగానే వున్న శాంతమ్మ ఆకస్మికంగా గుండెపోటుకు గురై తుదిశ్వాస విడిచారు. ఈ నేపథ్యంలో సమాచారం అందుకున్న హర్షిత్ రెడ్డి శనివారం ఇక్కడికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## పుత్తూరులో గోరక్ష మహా పాదయాత్ర

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త:

అఖిల భారత గోసేవ ఫౌండేషన్ బాలకృష్ణ గురుస్వామిచే జమ్మూకాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు నిర్వహించబడుతున్న గోరక్ష మహా పాదయాత్ర నేడు పుత్తూరుకు విచ్చేసిన సందర్భంగా విశ్వ హిందూ పరిషత్ వారిచే తడుకు రామారావు ఆధ్వర్యంలో ఘనంగా గోపూజ నిర్వహించారు. ఈ యాత్ర సెప్టెంబరు 27 తేదీ జమ్మూకాశ్మీర్లో బయలుదేరి కాలినడకన 128 రోజులు 3700కి.మీ ప్రయాణం సాగి పుత్తూరుకు చేరింది. ఇంకనూ ముగింపు కన్యాకుమారి చేరడానికి 1200 కి.మీ 52 రోజులు పడుతుంది. మొత్తం 4900 కి.మీ 180 రోజులు 14 రాష్ట్రాల గుండా ప్రయాణం. గోపూజ తరువాత సుబ్రహ్మణ్యం స్వామి గుడి దగ్గర నుంచి తిరుపతి రోడ్డు, అంబేద్కర్ సర్కిల్ ఆర్డీఎం గేటు వరకు యాత్ర సాగింది. ఆర్డీఎం గేటు వద్ద యాత్ర ముగింపు సందర్భంగా గీతాసమాజం బాలకృష్ణారెడ్డి ప్రసంగిస్తూ హిందువులు ఆవును నూతన గృహ ప్రవేశం, దేవాలయాల్లో పూజిస్తుంటామని, ఆవు పేడ, మూత్రములో ఔషధ విలువలు ఉంటాయని అందుకే గోరక్షణ చేసి, గోవదను నిషేధించాలని, అందుకు సహకరించే ప్రభుత్వాలను తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో తడుకు రామారావు, శ్రీధర్రాజు, బీజేపీ జిల్లా కార్యదర్శి కోటకొండ బాబు, పుత్తూరు మండల అధ్యక్షుడు గిరిప్రసాద్, సి.ఏ. రామకృష్ణ, కుమారస్వామి, అరుణాచలంరెడ్డి, కఠారి మునికృష్ణ, విశ్వ హిందూ పరిషత్ నాయకులు, పుర ప్రముఖులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం:ఎమ్మెల్యే



వెంకటగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : పేదల సంక్షేమ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే కురుగొండ్ల రామ కృష్ణ తెలిపారు. మండలం ముద్దంపల్లి గ్రామంలో ఉదయం 6.30 గంటలకే ఆయన గ్రామం చేరుకుని పెన్షన్లను అందజేశారు. ప్రతి నెల ఒకటో తేది పెన్షన్లు ఇంటికి చేరుస్తున్నట్లు ఆయన లబ్ధిదారులకు తెలిపారు. గత ప్రభుత్వం పెంఛన్లు సక్రమంగా చేయక ఇబ్బంది పెట్టిందని అన్నారు. ఇంటింటికి వెళ్లి పెన్షన్లను అంద జేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి జి. నాగేశ్వర రావు, ఎంపిపి తనుజ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు పప్పు చంద్రమౌళిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మద్యం బాటిళ్లు స్వాధీనం



వాకాడు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కోట మండలంలోని చిట్టెడు గ్రామంలో అక్రమ మద్యం తరలిస్తున్న మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు వాకాడు ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఎక్సైజ్ అధికారులు తనిఖీ నిర్వహిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ డిపార్ట్మెంట్ అధికారులు పి. వెంకటేశ్వర్లు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## నీటి ఎద్దడిని ఎదుర్కొంటాం : ఎంపిడిఓ

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : వేసవి వచ్చిందంటే మండలంలోని పలు గ్రామాల్లో గుప్పెడు నీటి కోసం పడరాని పాట్లు పడాల్సి వస్తుంది. ఎండాకాలంలో కుళాయిల వద్ద గంటలకొద్దీ నిరీక్షించడం, సమీపంలోని వ్యవసాయ పొలాల వద్ద పరుగులు తీయాల్సిన పరిస్థితి. ఈ నేపథ్యంలో శనివారం ఎంపిడిఓ వేణు విలేఖరులతో మాట్లాడుతూ కోట మండలంలో 360 చేతిబోర్లు ఉన్నాయని, ఏ గ్రామంలో అయినా బోర్లు రిపేర్లకు గురయితే ఆయా గ్రామాల్లోని కార్యదర్శులకు ఫిర్యాదు చేయడం లేదా ఆర్‌డబ్ల్యుఎస్ ఏఇకి, తనకు ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. మండలంలో మంచినీటి పథకాలు బాగా పనిచేస్తున్నాయని తెలిపారు. రాబోయే వేసవిలో నీటి ఎద్దడిని ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

## పేదలను మోసం చేసిన వైసిపి ప్రభుత్వం : ఎమ్మెల్యే



బాలాయపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : వైసిపి ప్రభుత్వం పేదలని మోసం చేసిందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. మండలం నిడిగల్లులో ఎమ్మెల్యే, మండల పార్టీ అధ్యక్షులు రావి మస్తాన్ నాయుడులు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఇంటింటికి వెళ్లి ఉదయాన్నే లబ్ధిదారులకు అందజేశారు. ఎమ్మెల్యే దృష్టికి పలు సమ స్యలు గ్రామస్తులు తీసుకొనిచ్చారు. గత ఐదు సంవత్సరాలుగా వైసిపి ప్రభుత్వంలో పెన్షన్‌దారులను పట్టించుకోలేదని విమర్శించారు. కూటమి ప్రభుత్వంలో ఉదయం 6నుంచే ప్రారంభించి సాయంత్రంలోపు నూరుశాతం 1వ తేదీనే, సెలవు వచ్చిన ముందురోజే అందిస్తున్నట్లు తెలిపారు. ఈ పెన్షన్ పంపిణీ కార్యక్రమంలో ఎంపిడిఓ డిజే వినీల్ కుమార్, ఈఓపిఆర్డి మోహన్ రాజు, మండల పార్టీ అధ్యక్షుడు రావి మస్తాన్ నాయుడు, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోటి నాగేశ్వరరావు, టిడిపి నేతలు ఆది వెంకటకృష్ణరెడ్డి, చిత్తూరు ఈశ్వరయ్య, మురళి, కూని శ్రీహరి, గాజులపల్లి చినకోటేశ్వరరావు, శేఖర్‌నాయుడు, ఏవిరమణయ్య, సిసి నాయుడు, చంద్రమౌళిరెడ్డి, గోళ్ళ మధు, కొర్రపాటి రామచంద్రనాయుడు, పెట్లూరు జనార్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఈ నెల 8,9 తేదీలలో సమరయోధుల చిత్రపటాల ప్రదర్శన



గూడూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : ఈ నెల 8,9 తేదీలలో నిర్వహించనున్న భారతదేశ స్వాతంత్ర్య సమర యోధుల వర్ణ చిత్రాల ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎఫ్ఎఫ్ఈ నిర్వహణ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. శనివారం గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో ఫ్రీడం ఫైటర్స్ ఎక్స్‌పో నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఫ్ఎఫ్ఈ కమిటీ సభ్యులు ఎండి అబ్దుల్ రహీం, షేక్ కాలేషా, నాశిన భాస్కర్ గౌడ్, డేగా రవి రాఘవేంద్ర తదితరులు మాట్లాడుతూ ప్రముఖ చరిత్రకారులు సయ్యద్ నశీర్ అహమ్మద్ సౌజన్యంతో ఎఫ్ఎఫ్ఈ కమిటీ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 8,9 తేదీలలో గూడూరు షాదీమంజిల్‌లో స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాల ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణంలోని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలు, కళాశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు హాజరై చరిత్రకు అందని ఎంతో మంది స్వాతంత్ర్య సమరయోధుల గురించి తెలుసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎఫ్ఎఫ్ఈ కమిటీ సభ్యులు ఎండి అబ్దుల్ రహీం, షేక్ కాలేషా, నాశిన భాస్కర్ గౌడ్, డేగా రవి రాఘవేంద్ర, నాజర్, జహాంగీర్, యస్థాని, జమాలుల్లా, అన్వర్ భాష, సద్దాం హుస్సేన్, అల్లీ హుస్సేన్, ఖాజా హుస్సేన్, షాహిద్ తదితరులు పాల్గొన్నారు.

## వర్గీకరణ అమలుకై లక్ష డప్పులు... వెయ్యి గొంతులు



వెంకటగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : ఈ నెల ఏడో తేది హైదరాబాదులో జరిగే లక్షల డప్పులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఏపీ ప్రజా సంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షులు గద్దల మునెయ్య తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలలో సామాజిక న్యాయమైన ఎస్సీ కులాల ఏబిసిడి వర్గీకరణ ఉద్యమం ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ నాయకత్వ ంలో సుదీర్ఘకాల ఉద్యమం కొనసాగింది. దాని ఫలితమే గత సంవత్సరం ఆగస్టులో సుప్రీం కోర్టు ఎస్సీ కులాల ఏబిసిడి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడం జరిగింది. ప్రజాస్వామికవాదులు, మేధావులు కవులు కళాకారులు మద్దతుతో ఫిబ్రవరి 7వ తేదిన హైదరాబాదులో ఎల్బీ స్టేడియం నుండి పెద్ద అంబేద్కర్ విగ్రహం వరకు జరగబోయే లక్ష డప్పులు వెయ్యి గొంతుల మాదిగల భారీ సాంస్కృతిక ర్యాలీని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్చార్జి ఎస్‌కె రఫీ, డక్కిలి మండల ప్రధాన కార్యదర్శి బండి రవి తదితరులు పాల్గొన్నారు.

## బిసి కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తులు చేసుకోండి

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కోట మండలంలో 2024-25 సంవత్సరానికి బిసి కార్పొరేషన్ కింద రుణాల కోసం లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకోవచ్చని ఎంపిడిఓ వేణు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేఖరులతో మాట్లాడారు. కోట మండలానికి 28 యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. బిసి, కాపు, కమ్మ, రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన వారు ఈ నెల 7వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఓబిఎంఎంఎస్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. గేదెలు, గొర్రెలు, దుకాణాలకు రుణాలు మంజూరు చేస్తారని తెలిపారు.

## గ్రామాల్లో పుట్టగొడుగుల్లా... బెల్టుషాపులు

నాయుడుపేట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : నాయుడుపేట మండలంలోని చిలమత్తూరు, కూచివాడ, కాపులూరు, పూడేరు, గొట్టిప్రోలు, ద్వారకాపురం తదితర గ్రామాల్లో బెల్టుషాపులు రోజురోజుకు పుట్టుకొస్తున్నట్లు గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం గ్రామాల్లో బెల్టుషాపులు నిర్మూలించాలన్న దృఢ సంకల్పంతో పనిచేస్తుంటే నాయుడుపేట మండలంలో ఎక్సైజ్-పోలీసు అధికారుల పర్యవేక్షణలోపం నిర్లక్ష్యం కారణంగా ప్రభుత్వ ఆశయాలకు తూట్లుపడుతున్నాయి, గ్రామాల్లో బెల్టుషాపులు నిర్వహించడం వల్లన యువత మద్యనికి బానిసలు అవుతున్నారని మహిళలు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి గ్రామాల్లో బెల్టుషాపులు నిర్మూలించే విధంగా చర్యలు తీసుకోవాలని గ్రామీణ మహిళలు కోరుతున్నారు.

## సామాజిక సేవలో శ్రీ గాయత్రి స్కూల్



గూడూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : గూడూరు పట్టణంలోని శ్రీ గాయత్రి ఇంగ్లీష్ మీడియం స్కూల్ 1వ వార్షికోత్సవం సందర్భంగా కటకరాజ వీధిలో ఉన్న సాయిరామ్ ఛారిటీ వృద్ధాశ్రమానికి రైస్ బ్యాగులు, కూరగాయలు, స్టాండ్ ఫ్యాన్ అందించారు. ఈ కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వాహకులు కళ్యాణి, శ్రీ గాయత్రి స్కూల్ కరస్పాండెంట్ శివకుమార్ రెడ్డి, స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## క్రీడల పట్ల మక్కువ చూపాలి : ఎమ్మెల్యే కురుగొండ్ల



వెంకటగిరి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : చదువుతో పాటు ఆటల పోటీలపై విద్యార్థులు శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో రెండు రోజుల పాటు జరిగే నియోజకవర్గ స్థాయి కబడ్డీ పోటీలను డిఎస్పి గీతా కుమారితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. విద్యార్థులు మానసికంగా ఆరగ్యంగా ఉండాలంటే ఆటలపై శ్రద్ధ చూపాలని తెలిపారు. చదువుతో పాటు క్రీడల్లో కూడా పాల్గొనాలని తెలిపారు. గ్రూడూరు డిఎస్పి గీత కుమారి మాట్లాడుతూ సెల్ఫోన్‌లో పిల్లలు ఏం చేస్తున్నారు తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఏవి రమణ, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంగోడు నాగేశ్వర రావు, మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కె. ప్రసాద్ నాయుడు, మండల పార్టీ అధ్యక్షులు పప్పు చంద్రమౌళి రెడ్డి, బాబు నాయుడు, మల్లారం బాబు, బాబు తదితరులు పాల్గొన్నారు.

## చీకళ్లదిబ్బలో బస్సుషెల్టర్ ప్రారంభం



కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కోట మండలం పుచ్చలపల్లి పంచాయతీ చీకళ్లదిబ్బ గ్రామంలో బస్సు షెల్టర్‌ను శనివారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ప్రారంభించారు. తెలుగు దేశం పార్టీ నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి తల్లిదండ్రులు రామసుబ్బారెడ్డి, సుశీలమ్మ జ్ఞాపకార్థం ఈ బస్సు షెల్టర్‌ను సొంత నిధులతో ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో కోట నుంచి చీకళ్లదిబ్బ గ్రామం వరకు దశరథరామిరెడ్డి అనుచరులు బైక్ ర్యాలీ నిర్వహించారు. దశరథరామిరెడ్డి ఏర్పాటు చేసిన భారీ ఫ్లెక్సీలు అందరినీ ఆకట్టుకున్నాయి. అంతకుముందు కోటలో దివంగత నల్లపరెడ్డి గోపాల్‌రెడ్డి విగ్రహానికి ఎమ్మెల్యే పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో నల్లపరెడ్డి జగన్మోహన్‌రెడ్డి, జిల్లా టీడీపీ మైనార్టీ సెల్ అధ్యక్షులు జలీల్ అహ్మద్, కొత్తపాలెం జలసంఘం అధ్యక్షులు నెల్లూరు మోహన్‌రెడ్డి, రాష్ట్ర రైతు కార్యదర్శి పలగాటి భాస్కర్‌రెడ్డి, జితేంద్రరెడ్డి, వెంకన్నపాలెం సర్పంచ్ మధుయాదవ్, బిసిసెల్ అధ్యక్షులు చాపల శ్రీనివాసులు, ఎంపిటిసిలు షంషుద్దీన్, సురేష్, పుచ్చలపల్లి సర్పంచ్ గోవర్ధన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణానికి సహకరిస్తాం

### - సబ్ కలెక్టర్‌తో నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి



కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: సాగరమాల రోడ్డు నిర్మాణానికి నెల్లూరుపల్లి కొత్తపాలెం పంచాయతీ లోని అగ్రహారం రైతులు పూర్తిగా సహకరిస్తారని, ఇందుకు రైతులను ఒప్పిస్తానని, అయితే నష్టపోయిన రైతులందరికీ పరిహారం ఇవ్వాలని తిరుపతి జిల్లా వైసీపీ యువజన కార్యదర్శి నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనాను కోరారు. శనివారం మండలంలోని అగ్రహారం, రుద్రవరం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలకు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్రహారంలో ఏర్పాటు చేసిన సభలో రైతుల తరపున నేదురుమల్లి హరిశ్చంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం పంట వేసిన రైతులకు ఎకరాకు రూ.30 వేలు ఇవ్వాలని కోరారు. అనంతరం భూములను రోడ్డు నిర్మాణానికి రైతులను ఒప్పిస్తామని రైతుల తరపున హామీ ఇచ్చారు. పరిహారం రెండురోజుల్లో ఇస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. అయితే మూడేళ్ల నుంచి 49 మంది రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని, అయితే పరిహారం మాత్రం ఇవ్వడం లేదని హరిశ్చంద్రారెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. రైతుల గురించి పట్టించు కోవడం లేదని తెలిపారు. నష్టపోయిన రైతాంగానికి పరిహారం ఇప్పిస్తామని సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనా హామీ ఇచ్చారు. ఈ గ్రామసభల్లో తహశీల్దార్ కె.జయజయరావు, డిప్యూటీ తహశీల్దార్ అజ్మతుల్లాఖాన్, సర్వేయర్ గోపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ కళాశాలలో అథ్లెటిక్ మీట్



గూడూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: నారాయణ ఇంజనీరింగ్ కళాశాల గూడూరులో అథ్లెటిక్ మీట్ తేదీన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గూడూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, నెల్లూరు నారాయణ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు, నారాయణ ఫార్మసీ కళాశాల విద్యార్థులు హాజరైనారు. వివిధ ఈవెంట్స్ 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 4/400 మీటర్ల రిలే, లాంగ్ జంప్, షాట్‌పుట్, 4/100 మీటర్ల రిలే, జావెలిన్ త్రో తదితర ఈవెంట్స్‌లో 600 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముగింపు ఫంక్షన్‌కి ముఖ్య అతిధిగా హాజరైన డాక్టర్ గీతాకుమారి, డిఎస్పి గూడూరు, మాట్లాడుతూ క్రీడలు మన జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఎందుకుంటే ఇది మనల్ని ఆరోగ్యంగా చురుకుగా ఉంచుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల ప్రిన్సిపాల్ వి. రవిప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ జెవి భాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులు ట్రోఫీలు లేదా బహుమతులు గెలుచుకునే లక్ష్యంతో తరచుగా పోటీ క్రీడా కార్యకలాపాలలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాధి పతులు, స్పోర్ట్స్ ఇంచార్జి డి.రాజేష్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్స్ రాఘవయ్య, సౌమ్య, అధ్యాపక, అధ్యాపకేతర ఎఓఎం సుధీర్, ఎఓ కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో తమిళ యువకులు

తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : తడలో అనుమానాస్పదంగా మాట్లాడుకుంటున్న ముగ్గురు తమిళనాడు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న ఎం.గురుస్వామి బస్టాండు సెంటర్లోని శ్రీకాళహస్తి రోడ్డులో ఉండగా, ముగ్గురు యువకులు మాట్లాడు కుంటున్నారు. వారిలో ఒకరి వద్ద పదునైన పెద్ద కత్తి ఉంది. తమిళనాడులోని మెట్టుపాలెంకు చెందిన టి.సతీష్‌కుమార్ వద్ద ఈ కత్తి ఉంది. అతనితో పాటు పూంగనగర్‌కు చెందిన ఎం.హరీష్, చెన్నైలోని తండయార్‌పేటకు చెందిన నవీన్‌కుమార్ ఉన్నారు. వీరు మాట్లాడుకుంటూ తమిళనాడులో తమ మీద పోలీసు కేసులు ఉన్నాయని, ఆంధ్రా అయితే తప్పించుకుని తిరుగుతామని, ఎవరూ గుర్తించరని మాట్లాడుకుంటుండగా స్థానికుల సహాయంతో వీరిని అదుపులోకి తీసుకున్నారు. తడ ఎస్ఐ కొండప్పనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం షాపులో రూ.1.70 లక్షలు చోరీ



కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : కోట మండలం చిట్టేడులోని మద్యంషాపులో శుక్రవారం రాత్రి దొంగలు పడ్డారు. షాపులో ఉన్న ఒక లక్షా 70 వేల రూపాయలు నగదు, మూడు ఫుల్ బాటిళ్ల మద్యాన్ని అపహరించారు. ఆ మేరకు కోట పోలీసుస్టేషన్‌లో శనివారం ఫిర్యాదు అందింది. ఎస్ఐ పవన్‌కుమార్ చిట్టేడులోని మద్యం షాపు వద్దకు వెళ్లి చోరీ జరిగిన తీరును పరిశీలించారు. సిసి టివి ఫుటేజి ఆధారంగా దొంగలను గుర్తిస్తామని చెప్పారు.

## ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 95 శాతం పంపిణీ

కోట, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కోట మండలంలో శనివారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 95 శాతం పంపిణీ చేసినట్లు ఎంపిడిఓ వేణు చెప్పారు. శనివారం ఉదయం 6 గంటలకే పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. వితంతు, వికలాంగులు, వృద్ధాప్య పింఛన్లను అందజేశామన్నారు. 6,964 మందికి 2 కోట్ల 94 లక్షల రూపాయలు పంపిణీ చేశామని పేర్కొన్నారు.

## ఆగని విద్యుత్ మోటార్ల దొంగతనాలు

### - పలు గ్రామాల్లో లబోదిబోమంటున్న రైతన్నలు



తడ, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : వ్యవసాయ సీజన్ ఆఖరులో విద్యుత్ మోటార్ల దొంగతనాలు రైతన్నలను బాధిస్తున్నాయి. ఇటీవల పొలాల్లో ఉన్న విద్యుత్ మోటార్ల దొంగతనాలు పెరిగిపోయాయి. పలుచోట్ల పైభాగాన్ని పగులగొట్టి లోపల ఉన్న విలువైన వైరును తస్కరిస్తున్నారు. మరికొన్నిచోట్ల ఏకంగా విద్యుత్ మోటార్లను ఎత్తుకుపోతున్నారు. చలి విపరీతం కావడంతో రైతులు రాత్రిపూట మోటార్ల వద్ద నిఘా ఉంచకపోవడం దొంగలకు మేలవుతోంది. ఇది ఒక్కరి పని కాదని, కొంతమంది సమూహంగా మారి విద్యుత్ మోటారు దొంగతనాలు చేస్తున్నారని రైతులు అంటున్నారు. సూళ్లూరుపేట విద్యుత్ శాఖ ఏడీ పరిధిలో ఇటీవల పలుమార్లు పోలీసులకు ఫిర్యాదులు అందాయి. పోలీసులు ఇటువంటి సామగ్రిని కొనుగోలు చేసే వారిపై నిఘా ఉంచారు.

## గణనాధుని సేవలో జిల్లా కలెక్టర్



కాణిపాకం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ దంపతులు శనివారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట ఐరాల తహశీల్దార్ మహేష్‌కుమార్, స్థానిక ఎస్సై ధరణీధర తదితరులు పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి!



చౌడేపల్లి, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : అనుమానాస్పదస్థితిలో వ్యక్తి ఉరేసుకొని మృతి చెందిన సంఘటన శనివారం రాత్రి చౌడేపల్లిలో చోటు చేసుకొంది. మృతుడి తల్లి రమాదేవీ కథనం మేరకు...పుంగనూరు మండలం చదళ్ళ కు చెందిన శివకుమార్(27) కోళ్ళఫారాల్లో పని చేసుకొంటూ జీవిస్తున్నాడు. గత రెండేళ్ళక్రితం చౌడేపల్లి పరిధిలోని పొదపల్లి వద్దగల ఓ కోళ్ళఫారంలో పనిచేసుకొంటున్నాడు. ఈక్రమంలో కోళ్ళఫారం ఆవరణంలోని గదిలోని రాడ్‌కు చీరతో ఉరేసుకొని అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. విషయా న్ని గుర్తించిన అక్కడ పనిచేస్తున్న మరోవ్యక్తి పోలీసులకు సమాచారమిచ్చాడు. ఎస్ఐ నాగేశ్వరరావు సంఘటన స్థలాన్ని చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా తన కుమారుడిని చంపేసి ఉరేశారని న్యాయం చేయాలని మృతిడి తల్లి రమాదేవి పోలీసులను కోరింది.

## తిరుపతి నుండి ప్రయాగ్‌రాజ్‌కు... ఆర్టీసి డైరెక్టు ప్రత్యేక బస్సు

తిరుపతి(రవాణ), ఫిబ్రవరి 1ప్రభాతవార్త: మహాకుంభమేళాకు వెళ్ళే భక్తుల సౌకర్యార్థం తిరుపతి నుండి ప్రయాగ్‌రాజ్‌కు ప్రత్యేక డైరెక్టు ఆర్టీసి బస్సు ఏర్పాటు చేసినట్లు డిపిటిఓ జి.నరసింహులు తెలిపారు. ఈ బస్సు ఈనెల 7వతేదీ, తిరిగి 14వతేదీ తిరుపతి నుండి బయలుదేరి 10రోజులు టూర్ ఉంటుందన్నారు. మధ్యలో ప్రయాగ్‌రాజ్, వారణాసి, గయా, కోణార్క్, పూరి, అన్నవరం ప్రాంతాలు ప్యాకేజీ క్రింద ఉంటుందన్నారు. సూపర్‌లగ్జరీ బస్సు ఒక మనిషికి 10వేల రూపాయలు ఛార్జీగా నిర్ణయించారు. 7వ తేదీ, తిరిగి 14వ తేదీ బస్సు రాత్రి 9గంటలకు తిరుపతి నుండి బయల్దేరుతుంది. టిక్కెట్లు బుకింగ్ కోసం "ఎపిఎస్‌ఆర్టీసిఆన్‌లైన్.ఇన్"లో మొబైల్‌యాప్ నుండి అవకాశం ఉంటుందన్నారు.

## జిల్లా మలేరియా అధికారిగా వేణుగోపాల్ బాధ్యతలు



చిత్తూరు, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: జిల్లా మలేరియా అధికారిగా డాక్టర్ వేణుగోపాల్ శనివారం డిఎంహెచ్ ఓ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. పలమనేరు ఫైలేరియా యూనిట్‌లో ఎంటమాల జిస్ట్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వేణుగోపాల్‌కు పదోన్నతి లభించడంతో జిల్లా మలేరియా అధికారిగా బదిలీపై నియమితుల య్యారు. ఈ సందర్భంగా జిల్లా మలేరియా అధికారి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ తనకు జిల్లాలో పని చేసిన అనుభవం వుండటంతో డెంగ్యు, మలేరియా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులను కట్టడి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తానన్నారు. దోమలను కట్టడి చేస్తే జ్వరాలు వచ్చే అవకాశం వుండదని ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడేను పక్కాగా పాటించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకొంటానన్నారు.

## పరకామణిలో పూర్తినిఘా ఉంచండి

### -లడ్డూల నాణ్యత బావుంది -ఛైర్మన్ బిఆర్‌నాయుడుతో భక్తులు



తిరుమల,ఫిబ్రవరి 1ప్రభాతవార్తప్రతినిధి: ఇష్టదైవం శ్రీవారికి భక్తులు తమ మొక్కుబడులుగా హుండీకి సమర్పించుకునే కానుకల విభజన,లెక్కింపు ప్రక్రియలో పరకామణి అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆదేశించారు. ఇక్కడ పరకామణిభవనంలో సిసిటివి నిఘా, భద్రత ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని ఆయన సూచించారు. శనివారం ఉదయం అధునాతన పరకామణిభవనాన్ని ఛైర్మన్ బిఆర్‌నాయుడు ఆకస్మిక తనిఖీ చేశారు. ఇక్కడ కానుకలుగా వచ్చిన నాణేలు, నోట్లు, బంగారు, వెండి, విదేశీ కరెన్సీ ఇతర కానుకల విభజన చేసే తీరును గమనించారు. బూందీపోటులో పరిస్థితులను తెలుసుకునేందుకు ఛైర్మన్ బిఆర్‌నాయుడు తనిఖీ చేశారు. అక్కడ బూందీతయారీ, నెయ్యివినియోగం, పిండిమిక్సింగ్, ముడిపదార్థాలు పోటుకు తరలించే విషయం. పోటు సిబ్బంది భక్తితో, విశ్వాసంతో బూందీతయారీలో నిమగ్నంకావాలని సూచించారు. భక్తులు లడ్డూల నాణ్యత బావుందని అభినందనలు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ వింగ్ విఎస్ఓ ఎన్టీవిరామ్‌కుమార్, పరకామణి సిబ్బంది పాల్గొన్నారు.

## సిఆర్‌ఓ,పిఆర్‌ఓ కార్యాలయాన్ని ప్రారంభించిన మంత్రులు



శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఇక్కడ నియమించబడిన ఇఓ టి,బాపిరెడ్డి స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి ఆదేశాలు, సూచనలతో పలు సంస్కరణలు, మార్పులు చేపట్టారు. ఈ నేపథ్యంలో పరిపాలనా భవనం సమీపంలోని సిఆర్‌ఓ, పిఆర్‌ఓ కార్యాలయా లతో ఇబ్బందిగా ఉండటంతో భక్తులు,అతిధులకు అందుబాటులో ఉండేటట్లు నాల్గవ గేటు సమీపంలో కొత్తగా సిఆర్‌ఓ,పిఆర్‌ఓ కార్యాలయాలను ఏర్పాటు చేసారు. ఎవరు వచ్చినా నాల్గవ గేటు నుంచి లోపలకు వాహనాలు రాకుండా పక్కనే పార్కింగ్ ఏర్పాటు చేసారు. ఈ భవనాలను శనివారం రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వరన్, దేవాదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్, ఆర్‌డివో భాను ప్రకాష్‌రెడ్డిలు ప్రారంబించారు. ఈ కార్యక్రమాల్లో యాదవ కార్పొరేషన్ చైర్మెన్ నరసింహాయాదవ్, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్య నాయుడు, పాలసరఫరా సంఘ చైర్మెన్ రావిళ్ళ ముని రాజానాయుడు జడ్‌పిటిసి సుబ్బారెడ్డి, రాష్ట్ర పార్టీ నాయకులు గురువారెడ్డి, నెమళ్ళూరు బుజ్జి, దశరధాచ్చారి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీవీరాంజనేయ స్వామి బాలాలయ ప్రతిష్ట పూజలు



కాణిపాకం, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం ప్రధాన ఆలయం ప్రాంగణంలో శ్రీవీరాంజనేయస్వామి బాలాలయ ప్రతిష్ట మహోత్సవం పూజలు శనివారం శాస్త్రోక్తంగా ప్రారంభమ య్యాయి. ప్రస్తుతం వున్న శ్రీవీరాంజనేయస్వామి ఆలయాన్ని పడగొట్టి సుమారు 1.10 కోట్లు రూపాయల వ్యయ అంచనాలతో రాతితో పునర్నిర్మాణం చేయడానికి అమెరికాకు చెందిన ప్రవాస భారతీయుడు ముందుకు వచ్చారు. దీనితో ఆలయ నిర్మాణ పనులకు సంభందించి ఇదివరకే భూమిపూజ కూడా చేశారు. ఈపూజలు శనివారం నుండి మూడు రోజుల పాటు జరుగనున్నాయి. ఈమేరకు ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమగుండం వద్ద విశ్వక్సేన ఆరాధన, పుణ్యాహావాచనం, మృత్సంగ్రహణం, అంకురార్పణ, పాలిక ఆరాధన, నివేదన తీర్థ గోష్టిప్రసాద వితరణ వంటి పూజాధి కార్యక్రమాలను వేదపండితుల మంత్రోచ్ఛారణ నడుమ అర్చకులు ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెం ట్‌లు కోదండపాణి, వాసు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజీనాయుడు, రవిలతో పాటు ఆలయ అర్చకులు, వేదపండితులు పాల్గొన్నారు.

## ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యం : కమిషనర్



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 1 ప్రభాతవార్త : ప్రతి పేద కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పని చేయాలని కమిషనర్ ఎన్. మౌర్య పేర్కొన్నారు. తుడా కార్యాలయంలో కమిషనర్ ఆధ్వర్యంలో సిటీ లెవెల్ టాస్క్‌ఫోర్సు కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ దీనదయాళ్ జాతీయ పట్టణ జీవనోపాదుల సంస్థ ఆధ్వర్యంలో పట్టణంలోని జీవనోపాధుల కల్పనకు సంబంధించిన అన్ని శాఖలు, పరిశ్రమలు, అధికారులు, స్వచ్ఛంద సంస్థలు, స్వయం సహాయక సంఘ సభ్యులతో సిటీ లైవిలిహుడ్ టాస్క్‌ఫోర్సు కమిటీని ఏర్పాటు చేయడమైనదని అన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రాబోయే ఐదు సంవత్సరాలకు పట్టణంలోని నిస్సహాయులు, పేదలు అందరికీ సుస్థిర జీవనోపాదులు కల్పించే అవకాశాలు అవసరమైన సమన్వయం, అవసరమైన కార్యక్రమాలతో సిటి లైవిలిహుడ్ యాక్షన్ ప్లాన్ రూపొందించబడుతుందని అన్నారు. మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ డి. రవీంద్ర, ఎన్ఐ- ఎంఎస్ఎంఈ నుండి రాజేంద్ర ప్రసాద్, సిఎంఎంఎస్ కృష్ణవేణి, ఎస్ సోమకుమార్, కమిటీ మెంబెర్స్, లేబర్ ఆఫీసర్, జిఎం ఇండస్ట్రీస్, జూనియర్ ఎంప్లాయిమెంట్ ఆఫీసర్, మార్కెటింగ్ అసోసియేషన్ అధ్యక్షులు పాల్గొన్నారు.

**CLASSIFIED**

I,**RAEE MAMATHA** (old name), W/o Pyneni Murali Krishna, R/at D.No.2-40, Pullaiahgaripalli (V), Rangampeta (P),Chandragiri (M), Tirupati Dist.A.P. I have changed my name to **PYNENI MAMATHA** W/o Pyneni Murali Krishna. Henceforth I shall be known as **PYNENI MAMATHA** (New Name)